ఆంధ్ర సచిత్ర వారపత్రిక: 17-23 ఏప్రిల్, 1987

# అమ్మ

వెంకటస్వామి ఆగాడు.

అతగాడి వెనుక గల సి.ఆర్.పి. వాళ్ళు ఆగారు.

ఏడుపు వినపడ్డది మళ్ళీ.

చెవులు రిక్కించి విన్నాడు వెంకటస్వామి.

అర్ధరాత్రి దాటింది. ఆకాశం మేఘావృతమై వుంది. నగరం, మతకలహాల మహమ్మారి వల్ల అలసి, సొలసి వుంది. కర్ఫ్యూ కూడా వుంది.

ఏడుపు వినపడ్డ వేపు, వెంకటస్వామి నడిచాడు. వెనుక సి.ఆర్.పి. వాళ్ళు అనుసరించారు.

గల్లీలోకి మళ్ళారు.

బూట్ల క్రింద రాళ్ళు నలిగిపోతున్నాయి.

ఆ గల్లీ అంతా చీకటిగా ఉంది. గలీజుగా కూడా వుంది. చెత్తా... చెదారంతో, వళ్ళంతా పుళ్ళు... గజ్జి వచ్చిన తల మాసిన వాడిలా వుంది ఆ గల్లీ.

ఆ గల్లీలో ఓ దుకాణం ముందు, గుడ్డల్లో చుట్టిన చోట నుండి ఏడుపు ఉండి ఉండి వస్తున్నది.

వెంకటస్వామి ఆ గుడ్డల దగ్గరకు వెళ్ళేందుకు అడుగు ముందుకు వేశాడు.

"ఠైరో" సి.ఆర్.పి. సార్జెంట్ ఆపాడు.

"కుచ్ బి నై హోతా" వెంకటస్వామి చెప్పాడు. వెళ్ళి వంగి చూశాడు.

క్షణం ఆలోచిస్తూనే వుండిపోయాడు ఆశ్చర్యంగా!

"క్యాహై?"

"బచ్చీ! బహుత్ ఛోటా బచ్చీ!"

వెంకటస్వామి ఆ పసిపాపను చేతుల్లోకి తీసుకున్నాడు. అప్పుడు సి.ఆర్.పి.వాళ్ళూ దగ్గరకు వచ్చారు.

నెలల పసికందు.

వెంకటస్వామి ఎత్తుకునేసరికి, ఏడుపు ఆపింది ఆ పసికందు.

ఆ గల్లీ అంతా దుకాణాలే! మరి ఈ పసికందు ఎక్కడ నుండి వచ్చింది? వెంకటస్వామికి సమాధానం దొరకలేదు.

"ఛలో" సి.ఆర్.పి. సార్జెంట్ అన్నాడు.

"ఏ బచ్చీకూ! క్యాకర్నా?"

"ఛోడ్‌కే ఆవ్!"

వెంకటస్వామికి మనసొప్పలేదు. పసికందు! వదిలేసి వెడితే, ఏ కుక్కో, పిల్లో చంపెయ్యడం ఖాయం. పైగా మతకలహాలు, కర్ఫ్యూ వల్ల జనం బయటకు రావడం లేదు. తెల్లారితే కర్ఫ్యూ ఎప్పుడు సడలిస్తారో కూడా తెలియదు.

"ఛలో" సార్జెంట్ తొందర చేశాడు.

వెంకటస్వామి పసికందును తీసుకునే బయలుదేరాడు!

నడుస్తూనే ఆలోచించాడు వెంకటస్వామి.

పోలీసు స్టేషన్‌కు వెళ్ళి, ఈ పసికందును అక్కడ అప్పచెప్పేస్తాడు. వాళ్ళు ఆ పిల్లను ఏ అనాధ శరణాలయానికో జేరుస్తారు. అంతటితో తన బాధ్యత తీరిపోతుంది.

ఈ పిల్లది ఏ కులమో, ఏ మతమో, ఎవరికి పుట్టిందో? ఎవరికన్నా అక్రమ సంతానమేమో!

మతం పేరిట జనం గొంతులు కోసుకుంటున్నారు. ప్రాణాలకు విలువ లేకుండా పోయింది. రోజూ గృహదహనాలు, హత్యలు, కత్తిపోట్లు, దొమ్మీలు, లూటీలు జరుగుతున్నాయి. అలాంటి సమయంలో ఈ పసికందు మరణిస్తే యేం?

వెంకటస్వామి ఆలోచిస్తూనే తెల్లారిందాకా డ్యూటీ చేశాడు. సి.ఆర్.పి. దళానికి దారి చూపుతూ ముందు నడిచాడు.

తెల్లవారుతుండగా, ఓ యింటి తలుపు తెరిపించి, కాసిని పాలు ఆ పాప గొంతులో పోశాడు.

తెల్లవారింది.

వెంకటస్వామి డ్యూటీ దిగే వేళయింది.

పసికందును పోలీసు స్టేషన్‌లోకి తీసుకువెళ్ళి వళ్ళో పెట్టుకు కూర్చున్నాడు.

సెంట్రీ అడిగాడు ఎవరని?

చెప్పాడు.

యస్.ఐ. అడిగాడు!

చెప్పాడు.

సర్కిల్ వచ్చాడు. కేకలేశాడు.

"బుద్ధుందా నీకు, డ్యూటీ చెయ్యవయ్యా అంటే వీధులెంట తిరిగి ఈ పిల్లముండను వెంట తెచ్చావ్! చూడు ప్రజాసేవ చెయ్యాలంటే ఈ పోలీసు ఉద్యోగం మానెయ్యి. రాత్రింబవళ్ళు కాపలా కాయలేక ఛస్తుంటే. ఈ పిల్లముండను తెచ్చిపెట్టావ్! చూడు తీసుకెళ్ళి, ఆ మూసీలోనో, చెత్తకుండీలోనో పారెయ్యి. ఏ ముండ కన్నదో దీన్ని."

పిల్ల ఆకలై ఏడుస్తున్నది ఉగ్గబట్టి.

స్టేషనంతా హడావుడిగా వుంది. ఎక్కడో పాల వ్యాను తగలెట్టేశారు. మరోచోట ఓ గుడి తలుపులు బద్దలు కొట్టి, విగ్రహాలు ధ్వంసం చేశారు. పంది మాంసం తెచ్చి మశీదులో పడేశారు. మతసామరస్యం కోరిన నాయకుడిని, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు.

"నువ్వెందుకిక్కడ? కొంపకు ఫో! అన్నం తిని మళ్ళీ డ్యూటీకిరా"

ఏడ్చి ఏడ్చి ఆ పసికందు ముహం ఎర్రబడ్డది. అలసి, సొక్కిపోయింది. ఎక్కిళ్ళు పెట్ట సాగింది.

పుణ్యానికి పోతే, పాపం ఎదురౌతుందేమో? ఈ పిల్ల ఆకలికి తాళలేక తన చేతుల్లోనే హరీ అంటుందేమో. వెంకటస్వామికి భయమేసింది.

ఆ పిల్లను తీసుకుని ఇంటి దారి పట్టాడు.

ఈ పిల్లను ఏం చేయాలి?

రాత్రంతా డ్యూటీ చెయ్యడం వల్ల వళ్ళంతా నొప్పులు. పైగా ముసలితనం. ఊపిరాడ కుండా, రాత్రింబవళ్ళు డ్యూటీ చెయ్యడం - వెంకటస్వామికి అసహనం ముంచుకొచ్చింది. ఓ చేత్తో సైకిలు, చంకన పిల్ల, నడవటమే కష్టంగా వుంది. వీధుల్లో మనిషి లేడు. ఆవులు కొన్ని నడిరోడ్డు మీద పడుకోనున్నాయి అంతే! ఊరంతా స్మశాన శాంతి!

ఇంట్లో అడుగు పెట్టేసరికి భార్య పార్వతమ్మ చేస్తున్న పని ఆపి, వెంకటస్వామిని చూసి, "ఇప్పటి దాకా యాడ చచ్చావ్! ఇంత ప్రొద్దెక్కిందాకా రాకపోతే, ఎవడన్నా పొడి చాడేమో, చచ్చి ఏ దవాఖానాలో వున్నావో అని అదిరి ఛస్తున్నా" అని వెంకటస్వామి చేతిలో పసిపిల్లను చూసి, "ఏందీ తెచ్చావ్?" అని, "దీన్నెక్కడ తెచ్చావ్?" అని గదమాయిం చింది.

వెంకటస్వామి మాట్లాడలేదు. పసిపిల్లను నేల మీద పడుకోబెట్టి, తనూ చతికిలపడ్డాడు.

"ఏంది రాయిలా మాట్లాడవు? నువ్వు తెచ్చే లచ్చలు యాడ మిగులుతాయ్యో అని, ఈ పిల్ల ముండను తెచ్చావా? నేనేడ సుఖపడతానో అని దిగులుగా వుందా? ఉన్న సంతు చాలదనా, మళ్ళీ దీన్నేసుకువచ్చావ్?"

వెంకటస్వామి మాట్లాడదల్చుకోలేదు.

'చా' త్రాగాడు. బీడీ కాల్చాడు. ఆలోచిస్తూనే వున్నాడు చాలాసేపు. పార్వతమ్మ పనులు చేస్తూ సతాయిస్తూనే వుంది.

"యింద! యాడకన్నా వెళ్ళి, పాలట్టుకురా. ముండగొంతులో పోస్తా! చస్తే ఆ పాపం నాకు చుట్టుకుంటుంది" అంది పార్వతమ్మ.

వెంకటస్వామి గిన్నె తీసుకు పాల కోసం వెళ్ళాడు. గల్లీలో ఒకరిద్దరు తిరుగుతున్నారు. పాలు అమ్మే పెంటమ్మ తలుపు వేసి వుంది. తలుపు తట్టాడు.

"ఎవ్రూ! పాలు లేవు"

"నేను పెంటమ్మా! కాసిని పాలు కావాలి."

పెంటమ్మ తలుపు తీసి, వెంకటస్వామిని చూసి, "పాలు పోశాగా! మళ్ళొచ్చావేంటి?" అని అడిగింది.

"పిల్ల దానికి పాలుగావాలి."

"పిల్లలెవరూ? మనవరాలొచ్చిందా?"

వెంకటస్వామి అవుననలేదు - కాదనలేదు.

పెంటమ్మ పాలు పోసింది.

లెక్కరాసుకో అని చెప్పి వెంకటస్వామి వచ్చాడు.

ఇంటి కొచ్చేసరికి, పార్వతమ్మ పిల్లకు వళ్ళు తుడిచి ఆడిస్తున్నది.

"ముండ సక్కటిది!" అని ముద్దెట్టుకుంది.

భోజనాలప్పుడు, ఆ పిల్ల ఎక్కడ దొరికిందో ఆ వివరాలు చెప్పాడు.

"దారిపొయ్యే తద్దినాన్ని వెంట తెచ్చుకోవడమంటే యిదే! ఇంకో ఆర్నెల్లకు డ్యూటీ దిగతావుగదా! ఆ తర్వాత మనమే ఏ కొడుకు దగ్గరకో వెళ్ళాలి. తా దూర కంత లేదు. మెడకో డోలని, దీన్నేడ పెట్టుకుంటామ్. పైగా ఇదాడ ముండ! మనకొద్దు. తీసుకెళ్ళి ఎవరికన్నా ఇచ్చెయ్యి! లేదా యాడన్నా వదిలెయ్యి. నే చావలేను. నాకూ ఓపిక లేదు. కళ్ళు కాపట్టం లేదు. ఆయాసం. ఈ వయస్సులో, పిల్లలను పెంచడం నాచేత గాదు. ఆ తర్వాత నీ ఇష్టం."

వెంకటస్వామికి పెళ్ళాం చెప్పిందాంట్లో బేసబబు ఏం కనపడలేదు.

సాయంత్రం దాకా పడి నిద్రపోయాడు. పిల్లదాన్ని ఏడుపుకు మెలకువ వచ్చినా, పెళ్ళాం సణుగుతున్నా మాట్లాడకుండా నిద్ర నటించాడు.

◆ ◆ ◆

నగరంలో కర్ఫ్యూ తొలగించారు.

వెంకటస్వామి శలవు పెట్టాడు.

ఓ రోజున తెలిసిన పత్రికా విలేఖరి ఇంటికి వెళ్ళి పిల్ల సంగతి చెప్పాడు. ఫొటో

తీయించి యిచ్చాడు. మరో రోజు అనాధ శరణాలయానికి వెళ్ళి విచారించాడు.

రేడియోలో పిల్ల దొరికిన సంగతి చెప్పించాడు.

పత్రికల్లో పిల్ల ఫొటో వేశారు. వెంకటస్వామి ఔదార్యం గురించి రాశారు.

అనాధ శరణాలయంలో, చెడిపోయిన ఆడాళ్ళనే జేర్చుకుంటామనీ, మరీ నెలల పిల్లను చేర్చుకోమన్నారు.

రేడియో ప్రకటన విని, ఒకాయన వచ్చాడు - పిల్లను చూచాడు.

"ఈ పిల్ల నిజంగానే దొరికిందా?"

"ఈ పిల్ల హిందువా? ముస్లిమా, క్రైస్తవురాలా?"

"నే తీసుకెళ్ళాక, మళ్ళీ తల్లితండ్రులు వచ్చి తీసుకెళతామంటే?"

అన్నిటికి వెంకటస్వామి సమాధానాలు చెప్పాడు.

'మేం హిందువుల పిల్లనే పెంచుకుందామనుకున్నాం. ఈ పిల్లేమొ, ముస్లిముల ఏరియాలో దొరికిందాయె! పైగా తల్లితండ్రి తెలియదంటున్నారాయె" అని అనుమానాలు, సందేహాలు వ్యక్తం చేశాడాయన.

పార్వతమ్మకు చిరాకేసింది.

"ఓ పెద్దమడిసి! బాగా ఇనుకో! వంకాయలు హిందువు అమ్మినా, తురకాయన అమ్మినా వంకాయలే! ఈ పిల్ల ఆడపిల్ల! అంతే! ఏ మతం అయితేనేం? ఏం కులమైతేనేం? ఇష్టమైతే తీసుకపో!"

ఆ వచ్చినాయిన వెళ్ళిపొయాడు.

ఓ దయానిధిగారు, ఐదు రూపాయల చందా ఇచ్చాడు - పిల్ల పాల కోసం!

పిల్లకు జ్వరమొస్తే, డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాడు వెంకటస్వామి, మందులు కొన్నాడు.

పిల్ల సమస్య అయింది వెంకటస్వామికి! దిగులు పట్టుకుంది.

"ఇప్పుడేడిస్తే ఏం లాభం! ఎనకా ముందు చూడకుండా ఎంట తెస్తివి. అనుభవించు!" అంది పార్వతమ్మ.

ఓ రోజు తోటి కానిస్టేబుల్ యాకుబ్‌కు చెప్పుకున్నాడు తన బాధ.

యాకుబ్ అంతా సావధానంగా విని, "చూడు వెంకటస్వామి! నా మాట ఇను. ఆ పిల్లను తీసుకెళ్ళి, ఏ తెల్లవారుఝామునో, ఏ ఆసుపత్రి దగ్గర్లో బస్‌స్టాపులోనో వదిలెయ్యి. తిరిగి చూడకుండా ఇంటికెళ్ళు! ఆ పిల్ల సంగతి మర్చిపో! అంతే!" అని సలహా ఇచ్చాడు.

ఓ రాత్రంతా ఆలోచించి, వెంకటస్వామి నిర్ణయానికొచ్చాడు.

'కన్నోళ్ళకు లేని జాలీ, యావ తనకెందుకూ? ఎవరెట్లా పోతే, ఛస్తే తనకేం? అంతే! ఈ పిల్లముండను తీసుకెళ్ళి వదిలేస్తే సమస్య పరిష్కారమవుతుంది!

ఆ ఆలోచన వచ్చాక, మనస్సు తేలికైంది. 'చా' త్రాగి, గడ్డం గీసుకున్నాడు. వెంకటేశ్వర స్వామికి మ్రొక్కుకున్నాడు - 'తాను పాపం చేస్తే దయతో క్షమించ'మని!

"పిల్లదాన్ని ఇటుతే!"

"దేనికి?"

"నీయమ్మ! ఉన్న ఇబ్బందులతోడు ఇదెందుకు? పదిహేను రోజుల నుంచీ, బుర్ర ఖరాబైంది - దీని గురించి ఆలోచించీ, ఆలోచించి! తీసుకెళ్ళి యాడన్నా వదిలేసొస్తా!"

"నిశ్చయించుకున్నావా?"

"ఆఁ"

పార్వతమ్మ క్షణం వెంకటస్వామి వేపు విచిత్రంగా చూసింది.

చాప మీద పడి నిద్రపోతున్న పిల్లను చూసింది.

పిల్ల గుప్పెట్లు మూసుకుని, ఓ ప్రక్కకు తిరిగి నిద్రపోతున్నది. ఎర్రతేలులా ఉంది పిల్ల. తొలకరి వానకు తలెత్తిన గరిక పీచుల్లా నెత్తి మీద జుత్తు! నిమ్మతొనల్లా పెదవులు! నుదుటపై చాదు బొట్టు.

"ఏందాలోచన! ఇచ్చెయ్యి!" తొందరు చేశాడు వెంకటస్వామి- "తెల్లారితే, జనం చూస్తారు. యాడన్నా వదిలి పెట్టేందుకు కుదరదు!"

పార్వతమ్మ పిల్లను గుండెలకు అద్దుకుంది.

"ముండ చక్కగా వుంది. పది రోజుల బట్టి దీనికి నీళ్ళు బొయ్య, కాళ్ళ మీదేసుకు పాలు బొయ్య, ప్రొద్దు పోతా వుంది. ఈ పిల్లది చేతుల్తో, కాళ్ళతో తన్నుతా వుంటే, చిన్న తనం, నా తొలి చూలు రోజులు జ్ఞాపకం వస్తున్నాయి. ఏ అమ్మ కన్నదో! నా ప్రక్కలో వుంది ఇన్నాళ్ళూ, మొదట్లో ఈ దయ్యం దేనికనుకున్నా... ఏమిటో దీన్ని తీసుకెడతానంటే ఎట్లాగో వుంది!"

"అందుకనేనె, తీసుకెళ్ళి వదిలేశొస్తా! రోజులు గడిచేకొద్దీ, ఇడవడం, వదలడం కుదరదు."

పార్వతమ్మ ఆ పిల్లను ముద్దెట్టుకుంది.

"మీరంత ఖచ్చితంగా తీసుకెడతానంటే నేనెందుకు వద్దనాలి. తీసుకెళ్ళండి. ఉంచు కున్న కొద్దీ, మమకారం పెరగటమే కానీ, ఇంకేం లేదు!"

"మరిచ్చెయ్యి."

"ఉండండి! పిల్ల ముండకు కాసిని పాలు పడతాను. మళ్ళీ ఏ వేళకు ఏ అమ్మ చేతుల్లో పడుతుందో!"

వెంకటస్వామి బీడీ కాలుస్తూ కూర్చున్నాడు.

క్షణాలు గడిచాయి. నిముషాలు సాగి, పావుగంట కూడా అయింది. పార్వతమ్మ ఊడిపడలేదు.

"ఏందే! తొందరగా తీసుకురా" కేకేశాడు అసహనంగా!

"ఏందా గావు కేకలు! పిల్ల ఝుడుసుకోగలదు."

"పాలు పట్టడం కాలేదా?"

"అయింది!"

"మరింక ఆలస్యం దేనికి?"

"సడేలే! కాస్త ఓ చెంబెడు నీళ్ళు పోసి, గౌనేసి ఇస్తా! కూర్చో!"

వెంకటస్వామి కక్కలేక, మింగలేక కూర్చున్నాడు.

తూర్పు తెల్లవారసాగింది.

కాకులు కలకలం చేయసాగాయి!

సిటీ బస్సుల రొద ఎక్కువైంది.

నగరం, వళ్ళు విరుచుకు, కళ్ళు తెరుస్తున్నది.

పార్వతమ్మ ఊడిపడలేదు!

వెంకటస్వామికి చిర్రెత్తుకొచ్చింది! దూకుడుగా గదిలో కెళ్ళాడు.

పాపకు గౌనేసి వుంది. నుదుట చాదుబొట్టు. పాప పార్వతమ్మ వళ్ళో ఆమె పసుపుతాడు పట్టుకుని, ఆమె మొహంలోకి చూస్తూ 'ఊ' కొడుతున్నది.

పార్వతమ్మ ఆ పాప కళ్ళల్లోకి చూస్తూ వుంది. ఆమె కళ్ళల్లో ఆర్ద్రత వుంది. కరుణ వుంది. కన్నీరూ వుంది.

పార్వతమ్మ... 'అమ్మ' ఆకృతి దాల్చి వుంది.

వెంకటస్వామికి నోట మాట రాలేదు.

"పార్వతీ" అన్నాడు గొంతు గద్గదమవగా!

పార్వతి కళ్ళెత్తి చూసింది! ఆమె కళ్ళల్లో వేయి దీపాల వెలుగులు!

"ఒరె! వెంకట్‌గా రిటైర్‌మెంట్ యాభై అయిదు నుంచి యాభై ఎనిమిది చేశార్రా" అంటూ యాకుబ్ వచ్చాడు.

"నిజమా" అన్నాడు వెంకటస్వామి.

"ఇదిగో పేపరు చూడు"

పార్వతమ్మ పిల్ల నెత్తుకు వచ్చి, "మా తల్లి వచ్చిన వేళావిశేషమే ఇది" అంది. ఆ పిల్లను ముద్దెట్టుకుంటూ!

"ఏంది వెంకటస్వామి! ఆ పిల్లను వదిలేస్తామంటివే!"

వెంకటస్వామి మాట్లాడలేదు! పేపర్లో మొహం దాచుకున్నాడు.

పార్వతమ్మ అంది - "అన్నయ్యా! గొడ్డొచ్చిన వేళ బిడ్డొచ్చిన వేళ అన్నారు! లక్ష్మీదేవిలా శుక్రవారం వచ్చింది యింటికి. పైగా, నా కంతా మగబిడ్డలేగా! అళ్ళకూ మగబిడ్డలే! అందుకే ఈ పిల్లను ఉంచుకుంటాం! పెంచుకుంటాం!"

ఎంతయినా పార్వతమ్మ ఆడది! పైగా బిడ్డల తల్లి! ఆ తల్లికి తెలుసు. తల్లి ప్రేమ అంటే ఎమిటో' అనుకున్నాడు - బిడ్డనూ, ఆమె నెత్తుకున్న తల్లిని చూసి యాకుబ్. ●